క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు పనులను ఆదివారం గ్రామసర్పంచ్ నిర్మలమ్మ, వైస్ఎంపీపీ తిప్పయ్య ప్రారంభించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.8 లక్షలతో పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పార్ల కృష్ణయ్య, రైతు సమితి నాయకులు రామకృష్ణ రెడ్డి, నాయకులు మల్‌రెడ్డి, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

పరామర్శ

దామరగిద్ద: మండల వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి సోదరుడి దినకర్మ సందర్భంగా ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ నర్సప్ప, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, మాజీ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, భీంరెడ్డి, పరుశురాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పేట ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జగదీష్ తదితరులు వారి వెంట ఉన్నారు.

మద్దూరు: దమ్‌గాన్‌పూర్ మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి భార్య వీరాదేవి అంత్యక్రియల్లో మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పాల్గొని, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శనివారం వీరాదేవి మృతి చెందారు.

నిడుగుర్తిలో రక్తదాన శిబిరం



ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని వివేకనంద యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని చేపట్టారు. నారాయణపేట ఏరియా ఆస్పత్రి వైద్యబృందం ఆధ్వర్యంలో 30 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యశోదమ్మ, ఎంపీటీసీ రాఘవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

‘సమస్యల పరిష్కారానికి కృషి’



మక్తల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు తనవంతుగా కృషిచేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. మక్తల్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం శాలువతో హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి నాగరాజ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టార్చ్‌లైట్‌లతో నిరసన



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని ఆస్పత్రి దగ్గరలో మున్సిపల్ సిబ్బంది జేసీబీ ద్వారా పనులు చేపడుతుండగా, ఆకస్మికంగా సాయంత్రం 6 గంటల సమయంలో కరెంట్ స్తంభం విరిగిపోయింది. దీంతో శివాజీనగర్, కిందిగేరి, లైన్‌వాడ, ధూల్‌పేట వరకు నిలిచిపోయింది. శివాజీ శోభయాత్ర కొనసాగుతుండగా, కరెంట్ లేకపోవడంతో భక్తులు, యువకులు మొబైల్ టార్చ్‌లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంగా విద్యుత్ శాఖ అధికారులకు ఆలస్యంగా తెలియడంతో అక్కడికి చేరుకున్నారు. గంట పాటు శ్రమించగా, అ తర్వాత మహంకాళీ మందిరం దాటిన తర్వాత కరెంట్ సరాఫరా కావడంతో ఆగ్రహంతో ఉన్న యువకులు శాంతించారు. అయితే మున్సిపల్ సిబ్బందితో పాటు విద్యుత్ అధికారుల మధ్య సమన్వయం లోపం కారణంగా ఈ ఘటన జరిగిందని పలువురు చర్చించుకున్నారు. జరగడం కొసమెరపు అంటూ పలువురు చర్చించుకున్నారు.

కార్మికులకు అన్యాయం

రాయచూరు రూరల్: సీఎం బసవరాజబొమ్మై ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పౌర కార్మికుల సంక్షేమానికి చోటు దక్కలేదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నరసప్ప ఆరోపించారు. ఆయన నగరంలో పాత్రికేయులతో మాట్లాడారు. నగరసభల్లో పనిచేస్తున్న 45 వేల మంది కాంట్రాక్ట్ పౌర కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీకి దిక్కులేకుండా పోయిందన్నారు. రాయచూరులో ఎయిమ్స్ మంజూరు కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తామని చెప్పి విస్మరించారని ఆరోపించారు.

మాయమవుతున్న మట్టి కుప్పలు

- జోరుగా అక్రమ రవాణా
- కరువైన అధికారుల నిఘా



రాత్రివేళలో మట్టి తరలిస్తున్న టిప్పర్ (ఫైల్)



టిప్పర్లు, ట్రాక్టర్లతో మొరం తరలింపు (ఫైల్)

మాగనూర్: మండలంలో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా జేసీబీల సాయంతో మట్టి(మొరం) కుప్పలను తవ్వి ట్రాక్టర్ల ద్వారా పట్టణాలు, గ్రామాలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల నిఘా కరువవడంతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాలువల మట్టిని భవిష్యత్తు అవసరాల నిమిత్తం పొలాల్లో కుప్పలుగా వేయగా అదను చూసి మూడోకంటికి తెలియకుండా తరలిస్తున్నారు. పెద్దవాగుపై నీటి నిల్వ కోసం అప్పటి ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి కృషితో నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టారు. అయితే రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కట్ట, కాలువలకు భవిష్యత్తులో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఉపయోగపడుతుందని మట్టిని కుప్పలుగా రైతుల పొలాల్లో నిల్వ ఉంచారు. అదేవిధంగా రిజర్వాయర్ నుంచి సాగునీరు మాగనూర్ ,మక్తల్, నర్వ మండలాలకు సరఫరా చేయడం కోసం కాలువలు తవ్వే సమయంలో వచ్చిన మట్టినీ గుట్టలుగా పోశారు. అయితే అధికారుల నిఘాలోపం, ఈ మట్టికి స్థానికంగా డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మొత్తం మట్టి కుప్పలను మాయం చేస్తున్నారు. మాగనూర్‌తో పాటు చుట్టు పక్కల శివారులో ఇళ్ల నిర్మాణాలకు, ఆయా గ్రామాలలో అవసరం ఉన్నవారికి అక్రమంగా అమ్ముతున్నారు. కుప్పలుగా ఉన్న మట్టిని ఇసుక తరహాలో టిప్పర్‌కు రూ.2500 నుంచి రూ.3000 వేల వరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే కొద్ది రోజుల్లోనే మొత్తం కుప్పలు మాయం అవుతాయని ఇప్పటికైనా అధికారులు నిఘా పెంచాలని స్థానికులు చెబుతున్నారు.

చర్యలు తప్పవు



సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మట్టిని అక్రమంగా తరలిస్తున్న మాట వాస్తవమే. అయితే మాకు సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోలేకపోతున్నాం. ఇప్పటికే అక్రమంగా మట్టిని అమ్ముకున్న వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయినా కొందరు రాత్రి సమయంలో మట్టిని తరలిస్తున్నారని తెలుస్తోంది. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్‌గౌస్, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్, మాగనూర్

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

మాగనూర్: బీఎస్పీ మండల నూతన కమిటీని ఆదివారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ పాలెం వెంకటయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షుడిగా సగరం రమేష్, ఉపాధ్యక్షుడిగా తలారి మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా తిమ్మప్ప, కోశాధికారిగా మహ్మద్ హాజీబాబా, కార్యదర్శిగా రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాలెం వెంకటయ్య మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేస్తూ బహుజన సమాజ్‌పార్టీని ప్రతి గడపకూ తీసుకువెళ్లాలని సూచించారు. నాయకులు మహమ్మద్ అమీర్, చంద్రశేఖర్, వాకిటి అంజనేయులు, కురువ బస్వరాజ్, నర్సింహ, కృష్ణ పాల్గొన్నారు.

22న వైద్య శిబిరం

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని యశోద ఆస్పత్రిలో ఈనెల 22న బుధవారం ఉచిత గుండె సంబంధిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రవీందర్ లాకావత్ తెలిపారు. శిబిరంలో హైదరాబాద్ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ్ పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మల్లికార్జునస్వామి జాతర



తిర్మలాపూర్‌లో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు



సిద్ధేశ్వర స్వామి జాతర మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీమల్లికార్జునస్వామి జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

నారాయణపేట టౌన్ : మహా శివరాత్రి సందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామున 5 గంటల వరకు పలు శివాలయాలలో భక్తులు ఆధ్యాత్మిక భజనలు చేపట్టారు. జాగరణ చేశారు. గాంధీనగర్‌లోని లింగయ్యస్వామి, తాయమ్మ హనుమాన్ మందిరంలోని అమరేశ్వరాలయం, బారంబావి శివాలయం, సుభాష్‌రోడ్‌లోని భక్త మార్కండేయ స్వామి, బహార్‌పేటలోని నీలకంఠేశ్వరస్వామి, పగిడిమార్రి రోడ్‌లోని మాతా మాణికేశ్వరి ఆశ్రమంలో నాగశేషునికి, అమ్మవారికి, అంబాన్నబావి శివాలయంలో శివలింగానికి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహా నైవేద్యం సమర్పించి, మహా మంగళ హారతి నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

మద్దూరు: నాగిరెడ్డిపల్లిలో వెలసిన సిద్ధేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా కొనసాగాయి.. గత రెండు రోజుల పాటు సిద్ధేశ్వర స్వామికి రుద్రాభిషేకం, పల్లకిసేవా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివరాత్రి ఉపవాస దీక్షలను విరమించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూ.50 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామని, మరో రూ.కోటిన్నరతో బీటీ రోడ్డు మంజూరు చేశామన్నారు. అదేవిధంగా కల్యాణ మండప నిర్మాణానికి హామీ ఇచ్చారు. అంతకుముందు భూనీడ్‌లో గుడిసె దగ్ధమైన కిష్టప్ప కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. ఇంటిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఉత్సవాల్లో నాగిరెడ్డిపల్లి, పల్లెర్ల, దమ్‌గాన్‌పూర్, నాగంపల్లి, మద్దూరు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణంలో పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దాత

నర్వ: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సిద్ధయ్యస్వామి, ప్రవీణ్‌కుమార్, నర్సింహయ్యలు వేదోక్త మంత్రోచ్ఛరణలతో స్త్రీ, పురుష సూక్తాలతో కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకంటే ముందు కల్యాణం, అన్నదాన దాత పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి బాలబ్రహ్మేశ్వరస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. గ్రామ పెద్దలు జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామన్‌గౌడ్, కాంతారెడ్డి, వడ్ల నారాయణ, సాతర్ల సత్యన్న, వెంకటేష్‌శెట్టి, శ్రీనువాసులు, సత్యం, పంతులు శ్రీనువాసులు, గోవిందు, గోపాల్, దౌలత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: మండల కేంద్రంలోని కావలిగేరిలో ఉన్న మల్లన్న స్వామి ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కల్యాణం నిర్వహించారు. జల్ది ఉరేగింపు నిర్వహించారు. శివభక్తులు ఖడ్గాలు చదివారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు మల్లప్ప, తిరుమలప్ప, భీమప్ప, నర్సిములు, అంజిలప్ప, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో ఊరేగింపు..

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: మండలలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అయ్యాయి. నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి తన సీడీపీ నిధుల నుంచి నిధులు మంజూరుచేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఆదివారం మండలంలోని విఠలపూర్ గ్రామంలో వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి సొదరుడి దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని గడిమున్కన్‌పల్లి లో ఎస్సీ కమ్యునిటీ హాల్ నిర్మాణానికి రూ. 10 లక్షలు. బాపన్‌పల్లి, మద్దెల్‌బీడ్, విఠలాపుర్‌ల బస్‌షెల్టర్‌ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

శివాజీ అడుగుజాడల్లో నడవాలి



మక్తల్‌లో శోభాయాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

జిల్లా కేంద్రంలో సూర్యవంశం క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. హిందూ రాజ్యస్థాపనకు కృషి చేసిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం శివాజీ జయంతి సందర్భంగా మక్తల్ నల్లజానమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య, మార్కెట్ మాజీ చైర్మన్‌లు నర్సింహగౌడ్ పాల్గొన్నారు. నేటి తరం యువత శివాజీ అడుగు జాడల్లో నడిచి దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాలని కోడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. కోస్గిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. మరికల్‌లో మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో రాజేష్, రవికిరణ్, నర్సిములు, రాంరెడ్డి, ఆంజనేయులు, పాల్గొన్నారు. కృష్ణా మండలంలోని ముడుమాల్, హిందుపూర్, కున్సి, గుడెబల్లూర్, కృష్ణా గ్రామాల్లో ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. మాగనూర్‌లో మండలంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు. ధన్వాడ మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో తపస్ జిల్లా నాయకులు నర్సిములు, హిందువాహిని జిల్లా అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, మండల అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు. పులిమామిడి, చిన్నపొర్ల, ఊట్కూరు గ్రామాలలో జరిగిన వేడుకల్లో నాయకులు భాస్కర్, విజయన్‌గౌడ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు. దామరగిద్ద ఆయా గ్రామాల్లో శివాజీ జయంతి నిర్వహించారు. కాన్‌కుర్తి సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ బస్వరాజ్‌ల సమక్షంలో విగ్రహ స్థాపనకు భూమిపూజ నిర్వహించారు. ఉల్లిగుండం సర్పంచ్ కిష్టారెడ్డి, ఎంపీటీసీ కిషన్‌రావ్, నాయకులు భీంరెడ్డి, బస్వరాజ్, శివకుమార్, సాయిరెడ్డి పాల్గొన్నారు. నర్వ మండలంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రామన్‌గౌడ్, అనిల్‌కుమార్, నవీన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

-సాక్షి నెట్‌వర్క్



మరికల్‌లో..



ధన్వాడలో ..



కున్సిలో..



మాగనూర్‌లో..



పేటలో మాట్లాడుతున్న రఘువీర్‌యాదవ్



బసిరెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న చిన్నారులు



ఉల్లిగుండంలో ర్యాలీ..



కోస్గిలో..

క్రీడాకారుడికి కన్నీటి వీడ్కోలు



తాహేర్‌పాష

మక్తల్: బ్లడ్ కాన్సర్‌తో బాధపడుతూ మృతిచెందిన క్రీడాకారుడు తాహేర్‌పాష(15) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో ప్రతిభచాటిన తాహేర్ శనివారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. తాహేర్‌ది మక్తల్ మండలం లింగంపల్లి. గ్రామానికి చెందిన చాంద్‌పాష, నసీమ్ బేగంల రెండో కుమారుడు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. పట్నాలో ఈనెల 10 నుంచి 13 వరకు జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. 17న ఇంటి దగ్గర తీవ్రంగా అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు మహబూబ్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి తాహేర్‌కు బ్లడ్ క్యాన్సర్ ఉందని నిర్ధారించారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు అతడిని బతికించుకుదామని ముందుకు వచ్చినా ఫలితం లేకుండా పోయింది. క్రీడాకారుడిగా ఎదుగుతున్న తాహేర్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు అతడికి కన్నీటితో వీడ్కోలు పలికారు.

మరమ్మతులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మాగనూర్: రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రయాణికుల అవస్థలు అంటూ ఈ నెల 12న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఆదివారం రోడ్డు మరమ్మతు పనులు మొదలుపెట్టారు. 167వ అంతర్‌రాష్ట్ర రహదారి విస్తర్ణ పనుల్లో భాగంగా మాగనూర్ మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన నాలుగులైన్ల రహదారి అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో బీటీ వేసి కనీసం రోజులు కూడా గడవక ముందే మరమ్మతులకు గురైంది. కాగా ఇంతకుముందు కూడా ఇలానే జరిగినా పైపై మరమ్మతులతో కాంట్రాక్టర్ చేతులు దులుపుకున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలంటున్నారు.

వైభవంగా శివయ్య రథోత్సవం



నిడుగుర్తి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



వడ్వాట్‌లో ..

మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం సాయంకాలం రథోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహానికి అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆనంతరం పల్లకీలో తీసుకొచ్చి రథంలో ఉంచారు. భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాల నడుమ రథం ముందుకు కదిలింది. వివిధ పార్టీల ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని నిడుగుర్తి, చిన్నపొర్ల గ్రామాలలో మహాశివరాత్రి సందర్భంగా రథోత్సవ వేడుకలను భక్తులు ఆదివారం సాయంత్రం చేపట్టారు. నిడుగుర్తి గుట్టపైగల గౌరీశంకర లింగేశ్వరి స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త బాల్‌రెడ్డి, కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట టౌన్ : గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, తదితర డిమాండ్లతో 20న పాదయాత్ర చేపట్టనున్నారు. దామర్‌గిద్ద నుంచి నారాయణపేట జిల్లా కలెక్టరేట్ వరకు పా ద యాత్ర ఉంటుందని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పాల్గొనాలని కోరారు.

తారకరత్న మృతి తీరని లోటు

కోస్గి: నందమూరి తారకరత్న అకాల మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు, పట్టణ అధ్యక్షుడు కుమ్మరి అంజిలయ్య ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.